## కేంద్ర మంత్రి బండి సంజయ్‌కి ఘన స్వాగతం

రేణిగుంట, జూలై 10 ప్రభాతవార్త:



కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కు రేణిగుంట విమానాశ్రయంలో బుధవారం ఘన స్వాగతం లభించింది. కేంద్ర హోం మంత్రి హోదాలో మొట్ట మొదటి సారి శ్రీవారి దర్శనార్థం ఆయన రేణిగుంట విమానాశ్రయం చేరుకున్నారు. విమానాశ్రయంలో ఆయనకు తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, బీజేజీ రాష్ట్ర అధికార ప్రతినిధులు భాను ప్రకాష్‌రెడ్డి, సామంచి శ్రీనివాసులు, ఆరణి మదన్, ఆరణి శివకుమార్ తదితరులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం కేంద్ర మంత్రి రోడ్డు మార్గంలో తిరుపతి బయలుదేరి వెళ్లారు.




## కలెక్టర్‌చే రాజ్యపురస్కార్ అవార్డులు ప్రదానం

శ్రీకాళహస్తి, జూలై 10 ప్రభాతవార్త



ఈఏడాదికి రాజ్యపురస్కార్ అవార్డులు పొందిన శ్రీకాళహస్తి బాబుఅగ్రహారం మున్సిపల్ ఉన్నత పాఠశాలకు చెందిన ఎస్.శ్రీనివా సులు, వినోద్, యశ్వంత్, మురళీ, లోకేష్‌లను జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి వి.శేఖర్, రాష్ట్ర ఆర్గనైజింగ్ కమిషనర్ పి.శ్రీనివాసరావు, జిల్లా స్కౌట్స్ కమిషనర్ వంశీరాజా, జిల్లా కార్యదర్శి ఎం.జయరాం, కార్యాలయ కమిషనర్ టి.రమేష్‌బాబు, రాష్ట్ర సహాయ కార్యనిర్వాహక కమిషనర్ కోటేశ్వరరావు, స్కౌట్స్ అండ్ గైడ్స్ డిటిసి వెంకటేశ్వర్లు, సావిత్రి, డిఓసి వెంకటేశ్వర్లు , సతి సావిత్రి, సహాయకమిషనర్ పార్వతీ, యువత ఛైర్మన్ అజారుద్దీన్, స్కౌట్ మాస్టర్లు యోగానందం, సుబ్రమణ్యం, ధనుష్ తదితరులు పాల్గొన్నారు.

## నాణ్యతతో సమస్యలు పరిష్కారం

### కలెక్టర్ సుమిత్‌కుమార్



: సిఎం పర్యటన సందర్భంగా వచ్చిన అర్జీలను సత్వరం పరిష్కరించడానికి తీసుకుంటున్న చర్యలపై అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

చిత్తూరు టౌన్, జులై 10 ప్రభాతవార్త:

కుప్పం సిఎం పర్యటన సందర్భంగా ప్రజల నుండి సిఎం నారా చంద్రబాబునాయుడుకు అందిన సమస్యలపై అర్జీలకు నాణ్యతతో పరిష్కరించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ సుమిత్‌కుమార్ కలెక్టరేట్‌లోని సమావేశభవనంలో బుధవారం జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులుతో కలిసి సిఎం పర్యటన అర్జీల పరిష్కరించడానికి తీసుకుంటున్న చర్యలపై అధికారులతో సమీక్షించారు. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ సిఎం నారా చంద్రబాబునాకయుడు గత నెల 25, 26 తేదీల్లో కుప్పం పర్యటించారని, ఈ పర్యటనలో భాగంగా సిఎం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో అందిన అర్జీల పరిష్కారంపై సంబంధిత శాఖలు సత్వరం చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే సర్వీసు అంశాలు, ఆర్థిక పరమైన అంశాలకు సంబంధించి ఉన్నత అధికారులకు నివేదిక పంపాలన్నారు. ప్రతి శాఖ వారీగా అధికారులు తమకు అందిన అర్జీలకు సంబంధించి తీసుకున్న చర్యలను ఈ సందర్భంగా కలెక్టర్ సుమిత్‌కుమార్‌కు వివరించారు. ఈ అంశంపై మరో పది రోజుల అనంతరం మళ్ళీ సమీక్షించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ నిర్ణయించారు. ఈ సమావేశంలో డ్వామా పిడి రాజశేఖర్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## తిరుపతి అభివృద్ధికి కలిసి పనిచేద్దాం





ఎస్వీ యూనివర్శిటీ సెనెట్ హాల్‌లో బుధవారం జరిగిన మున్సిపల్ కార్పొరేషన్ కౌన్సిల్ సమావేశానికి అధ్యక్షత వహించిన మేయర్ డాక్టర్ శిరీషా, హాజరైన కార్పొరేటర్లు

తిరుపతి కార్పొరేషన్, జులై 10, ప్రభాతవార్త

తిరుపతి అభివృద్ధికి రాజకీయాలకు అతీతంగా ప్రజా ప్రతినిధులు, అధికారులు, సిబ్బంది అందరు కలిసి పని చేద్దామని తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు కోరారు. మేయర్ డాక్టర్ శిరీష అధ్యక్షతన తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కౌన్సిల్ సమావేశం బుధవారం ఎస్వీ యూనివర్శిటీ సెనెట్ హాల్‌లో నిర్వహించారు. ఈ సమావేశంకు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ముఖ్య అతిథిగా హాజరు కాగా మేయర్ డాక్టర్ శిరీష అధ్యక్షతన, కమిషనర్ అధితి సింగ్ అజెండాను ప్రవేశ పెట్టారు. కౌన్సిల్ సమావేశానికి ప్రత్యేక ఆహ్వానితులుగా తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, తిరుపతి ఎంపి డాక్టర్ మద్దిల గురుమూర్తి, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం, కార్పొరేటర్లు కోఆప్షన్ సభ్యులు, అధికారులు కౌన్సిల్ సమావేశంలో అజజెండా అంశాలపై చర్చించి ఆమోదించారు. ఈ సమావేశంలో తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు మాట్లాడుతూ తిరుపతి అభివృద్ధి కోసం ఎంపి, ఎమ్మెల్సీ, మేయర్, కార్పొరేటర్లు, అధికారుల సహకారంతో పనిచేద్దామన్నారు. తిరుపతిలో అండర్ డ్రైనేజి సిస్టం పాతది అయిపోవడం, కొత్తగా యుడిఎస్ ఏర్పాటు చేసుకోవాలల్సిన అవసరం ఉందన్నారు. శానిటేషన్ మెరుగు పరుచుకోవల్సిన అవసరం వుందని, త్రాగునీరును సాఫీగా సరఫరా జరిగేలా చూడాలని, ఇన్నర్ రహదారులను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. టిడిఆర్ బాండ్లపై వస్తున్న ఆరోపణలపై ఒక నిజనిర్ధారణ కమిటి ఏర్పాటు చేయాలన్నారు. వచ్చే ఆగస్టు 15లోపు అన్న, డొక్కా సీతమ్మ క్యాంటీన్లు ప్రారంభించేందుకు అన్ని చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తెలిపారు. అనంతరం మేయర్ డాక్టర్ శిరీష మాట్లాడుతూ కౌన్సిల్ ఆహ్వానితులుగా నియమితులైన ఎమ్మెల్యే, ఎంపి, ఎమ్మెల్సిల సహకారంతో తిరుపతిని అభివృద్ధి చేసుకుందమన్నారు. నగర అభివృద్ధి చేసుకుందమన్నారు. నగర అభివృద్ధి కోసం అధికారుల సహకారంతో కార్పొరేటర్లు అందరం కృషి చేద్దామన్నారు. తదనంతరం కమిషనర్ అధితి సంగ్ మాట్లాడుతూ అభివృద్ధి అంశాలపై కౌన్సిల్ సమావేశంలో చర్చించి ఆమోదించడం జరిగిందన్నారు. అలాగే కార్పొరేటర్లు తెలియజేసే సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తామన్నారు.

### ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అభివృద్ధి అంశాలకు కౌన్సిల్ ఆమోదం మేయర్ శిరీష, కమిషనర్ అధితి సింగ్

**- తిరుపతిని అభివృద్ధి వైపుకు తీసుకెళుదాం**

**ఎంపి గురుమూర్తి, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం**

కౌన్సిల్ సమావేశంలో ముఖ్య అతిధిగా హాజరైన తిరుపతి ఎంపి డాక్టర్ మద్దిల గురుమూర్తి మాట్లాడుతూ ఎప్పుడో 30 సంవత్సరాల ముందు ఏర్పాటు చేసుకున్న యుడిఎస్ సిస్టం మొత్తాన్ని నూతనంగా నిర్మించుకోవాలని సూచిస్తూ ఇందుకోసం ఎంపిగా పూర్తిగా సహకిస్తానని తెలిపారు. అనంతరం ఎమ్మెల్సి సిపాయి సుబ్రమణ్యం మాట్లాడుతూ తిరుపతిని అందరి సమన్వయంతో కలిసి కట్టుగా అభివృద్ధి వైపుగా తీసుకెళుదామన్నారు. అజెండాలోని తీర్మానించిన ముఖ్య అంశాల్లో లక్ష్మీపురంలో సర్కిల్, రామానుజాచార్య సర్కిల్, ఆర్టీసి బస్టాండ్ సర్కిల్ ప్రాంతాల్లో ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు కొరకు 55.89 లక్షల రూపాయిలను కేటాయించడం జరిగిందన్నారు. ఒక సంవత్సరానికి 23 అద్దె వాహనములు ఏర్పాటు చేసుకోవడం కోసం రూ.10320000లు ఆమోదించడం జరిగిందన్నారు. తూకివాకం డ్రైవేస్ట్ షెడ్‌కు మిషనరి, ఫౌండేషన్, లైటింగ్ కోసం 3985000 రూపాయిలకు, కౌన్సిల్ సమావేశం ఆమోదం లభించింది. 11 వ వార్డులో పెద్ద కాపులేఔట్ ప్రదేశంలో సిసి రోడ్డు, కాలువల నిర్మాణానికి 37.80 లక్షలకు, హెల్త్, ఇంజనీరింగ్, యుడిఎస్ కార్మికులకు సిబ్బందికి యూనిఫాం, చెప్పులు, సోపులు, కొబ్బరినూనె తెప్పించుటకు 8710000, 35వ వార్డులో పాత యు డిఎస్ పైనలైన్లు మార్చుటకు 4070000, 1 నుండి 50 వార్డుల్లో యుడిఎస్ లైన్లులో బ్లాక్‌తీయుటకు కావాల్సినవస్తువులు,మిషనరికోసం 4155000, జోన్ 1,3,4వార్డుల్లో 49.35 లక్షలు, 5,6,7 వార్డుల్లో కాలువల్లో పూడికలు తీయించుటకు 49.80 లక్షలకు ఆమోదం తెలిపారు.

## కాణిపాకం ఆలయంలో ప్రక్షాళన చర్యలేవి?



**-సీఎం ఆదేశించినా అమలు చేయరా**


**-వివాదాలు, అవినీతి అక్రమాలకు కేంద్ర బింధువుగా వరసిద్ధుని ఆలయం**

కాణిపాకం, జూలై 10 ప్రభాతవార్త:

గత ఐదేళ్ళ వైకాపా పాలనలో కాణిపాకం శ్రీవరసిద్ది వినాయక స్వామి దేవస్థానంలో పెద్దఎత్తున అవినీతి అక్రమాలు చోటు చేసుకున్నాయని వీటిపై తగు చర్యలు తీసుకుని ఆలయంలో పూర్తిగా ప్రక్షాళన చేపట్టాలని స్వయానా రాష్ట్ర సీఎం నారా చంద్రబాబు నాయుడు పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ మురళీ మోహన్‌ను ఆదేశించినా అదిశగా అడుగులు పడకపోవడంతో పార్టీ నాయకులు, కార్యకర్తలతో పాటు భక్తుల మనోభావాలు దెబ్బతింటు న్నాయి. సీఎంగా బాధ్యతలు చేపట్టిన చంద్రబాబు తిరుమల శ్రీవారి దర్శనానంతరం తిరుమల నుండే ఆలయాల ప్రక్షాళన మొదలు పెడతానని ప్రకటిస్తూ ఆదిశగా చర్యలు చేపట్టి గత ఈఓ మార్పుతో చర్యలకు శ్రీకారం చుట్టారు. శ్రీవరసిద్ది వినాయకస్వామి దేవస్థానంలో ఆలయ అధికారుల అనాలోచిన నిర్ణయాలతో మితిమీరిన రాజకీయ జోక్యంతో ఆలయ ప్రతిష్ట మసకబారింది. ఆధ్యాత్మికతకు, ప్రశాంతతకు నిలయంగా వున్నకాణిపాకం ఆలయం గత మూడేళ్లకాలంలో అధికారుల అవినీతి అక్రమాలు, మితి మీరిన రాజకీయ జోక్యం కారణంగా వరస వివాదాలకు కేంద్ర బింధువుగా మారింది. కానుకల రూపంలో భక్తులు సమర్పించిన సొమ్మును ఆలయ ఉన్నతాధికారి, పాలక మండలి తమ స్వార్థ ప్రయోజనాల కోసం లక్షలాది రూపాయలు మంచినీళ్ళ ప్రాయంగా ఖర్చుచేశారనే అరోపణలున్నాయి. ఆలయ దర్శనార్థం వచ్చే సామాన్య భక్తులు కావలసిన కనీస వసతుల కల్పనకు చర్యలు చేపట్టాల్సిన ఆలయ ఉన్నతాధికారులు భక్తుల నుండి అధికారికంగా దోపీడీ కార్యక్రమంను అమలు చేసి పూర్తిగా వ్యాపార కేంద్రంగా మార్చేశారు. ప్రస్తుత ఈఓగా వున్న వెంకటేశు ఉద్యోగ బాద్యతలు చేపట్టినప్పటి నుండి గత ప్రభుత్వానికి, ఆపార్టీ నాయకులతో అంటకాగుతూ ఆలయంలో తన ఏక పక్ష నిర్ణయాలతో ఆలయంలో పనిచేసే ఉద్యోగులు,అర్చకులు, సిబ్బంది పలు రకాలుగా వేధింపులకు గురిచేస్తూ వచ్చారనే విమర్శలున్నాయి. అలాగే దేవస్థానం వద్ద నున్న ఈఓ క్వార్టర్స్‌లో లక్షలాది రూపాయలు దేవుడి సొమ్ముతో సకల సదుపాయాలు ఏర్పాటు చేసుకుని క్యాంపు కార్యాలయం అని బోర్డు పెట్టి నెలల తరబడి ఇంటి అద్దె చెల్లించకుండా ప్రభుతాన్ని మోసం చేశారనే ఆరోపణలు న్నాయి. అలాగే తమ స్వప్రయోజనాల కోసం దేవస్థానంలో లోక కళ్యాణం పేరిట నిర్వహించిన పలు రకాల పూజలకు గత ప్రభుత్వంకు అనుకూలంగా వున్న స్వామీజీలను రప్పించి లక్షలాది రూపాయలు దేవుడి సొమ్మును మంచినీళ్ళ ప్రాయంగా ఖర్చు చేశారనే అరోపణలున్నాయి. డిల్లీ, వారణాసి వంటి ప్రాంతాల్లో నిర్వహించిన స్వామివారి కళ్యాణం, గణపతిహోమంలకు ఆలయ అధికారులు కుటుంబసమేతంగా విమానాల్లో ప్రయాణిస్తూ, స్వామివారి విగ్రహాలను మాత్రం రైళ్లలో తరలించి ఆలయ ప్రతిష్టను దెబ్బ తీయడం అప్పట్లో తీవ్ర విమర్శలకు తావిచ్చింది. ముఖ్యంగా ఆలయంలో ఎటువంటి నోటిఫికేషన్‌లు లేకుండా సుమారు 20మంది వరకు ఉద్యోగ నియామకాలు చేసి అవినీతి అక్రమాలకు పాల్పడ్డారనే ఆరోపణలున్నాయి. అలాగే దేవస్థానంలో స్వామివారికి సమర్పించిన కానుకను మాయంచేశారనే ఆరోపణపై ఇన్‌చార్జి ప్రధానఅర్చకుడిని సస్పెండ్ చేసిన ఆలయ ఉన్నతాధికారి తాము ఆలయానికి విరాళంగా అందించిన అమ్మవారి విగ్రహాన్ని రశీదు ఇవ్వకుండా మాయం చేశారని దాతలు మీడియా ముఖ ంగా ఓ అర్చకునిపై ఆరోపణలు చేసినా అతనిపై ఎటువంటి చర్యలు తీసుకోకపోగా తనకు అనుకూలమైన వ్యక్తి కావడంతో అతనికి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఇన్‌చార్జి ప్రధాన అర్చకుడిగా పదోన్నతి కల్పిస్తూ తీసుకున్న నిర్ణయం తీవ్ర వివాదాస్పదమైంది. అలాగే దేవస్థానంలో ఏళ్ళనాటి నుండి అమలులో వున్న వంశపారంపర్య అర్చకత్వానికి తూట్లు పొడుస్తూ తమకు అనుకూలమైన బయట ప్రాంతాల నుండి వచ్చిన అర్చకులకు ప్రధాన ఆలయంలో విధులు కేటాయించడం మరో వివాదాస్పదమైంది. ముఖ్యంగా తమకు అనుకూలమైన కొంత మంది అర్చకులు, వేదపండితులతో కమీషనర్ అనుమతి లేకున్నా వైదిక కమిటీని ఏర్పాటు చేసి దేవస్థానంలో పనిచేసే అర్చకులు, సిబ్బందిని పలురకాలుగా వేధింపులకు గురిచేస్తున్నారనే ఆరోపణలున్నాయి. అనుకూలంగా లేని అర్చకులు, ఉద్యోగుల పట్ల కక్ష్య సాధింపు చర్యల్లో భాగంగా వారికి ప్రభుత్వం నుండి రావలసిన బకాయిలను సైతం నెలల తరబడి చెల్లించకుండా వేదిస్తున్నారనే ఆరోపణలున్నాయి. అదేవిధంగా ఆలయంలో జరుగుతున్న కోట్లాది రూపాయల అభివృద్ధిపనుల కాంట్రాక్ట్‌లు, టెండర్లువిషయంలో అవినీతిచోటుచేసుకుందని విమర్శలున్నాయి.

## పెద్దశేష వాహనంపై శ్రీనివాసుడు

### ఆగమోక్తంగా సాక్షాత్కార వైభవోత్సవాలు



చంద్రగిరి, జూలై 10 ప్రభాతవార్త:

సర్వాంతర్యామియైన శ్రీనివాసుడు పెద్దశేషవాహనంపై విహరిస్తూ భక్తులను అనుగ్రహించారు. శ్రీనివాస మంగాపురంలో వెలసియున్న శ్రీ కల్యాణ వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో మూడు రోజుల పాటు నిర్వహించనున్న సాక్షాత్కార వైభవోత్సవాలను బుధవారం ఆగమోక్తంగా ప్రారంభించారు. ఇందులో భాగంగా ఆలయ అర్చకులు స్వామి వారిని వైకువజామున సుప్రభాతసేవతో మేల్కొలిపి తోమాల అర్చనాధి నిత్యకైంకర్యాలను ఆగమోక్తంగా నిర్వహించారు. సాక్షాత్కార వైభవోత్సవాలను పురస్కరించుకుని ఉదయం 10 గంటల నుండి 11 గంటల వరకు శ్రీదేవి భూదేవి సమేత శ్రీనివాసుడు ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజనం నిర్వహించారు. ఇందులో భాగంగా పాలు, తేనె, కొబ్బరినీళ్ళు, పసుపు, గంధంతో స్నపన తిరుమంజనం నిర్వహించారు. రాత్రి 8 గంటలకు సర్వాంతర్యామి అయిన శ్రీనివాసుడు పెద్దశేష వాహనంపై విహరిస్తూ లోకరక్షకుడుగా ప్రజల ఈతిభాధలను తొలగించి మోక్షమార్గం ప్రసాధిస్తూ తిరుమాడవీధులలో ఊరేగుతూ భక్తులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో ఆలయ స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ ఈఓ వరలక్ష్మి, ఏఈఓ గురుమూర్తి, సూపరింటెండెంట్స్ తేనెపల్లి వెంకటస్వామి, నర్రా మునిచెంగల్రాయులు, టెంపుల్ ఇన్స్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్ రెడ్డి, ఆర్జితం ఇన్‌స్పెక్టర్ ధనశేఖర్, ప్రధాన అర్చకులు నారాయణాచార్యులు, తదితరులు పాల్గొన్నారు.

## తిరునగరిలో దొడ్డాపురం పాఠశాల ముందు మురుగు

### -డయేరియా నివారణ ఇలాగేనా!



*తిరుపతికార్పొరేషన్, జులై 10ప్రభాతవార్త:*

*సరస్వతినిలయంగా ఉన్న దొడ్డాపురంవీధిలోని నగరపాలకసంస్థ ఉన్నతపాఠశాల ముందు మురుగునీరునిలచి కంపు వస్తోంది. పాఠశాలకు ముందే స్థానికులు చెత్తాచెదారం పడేస్తూ పేరుకుపోయి కుళ్ళిపోతుండటంతో ఆ పరిసరాలు దుర్గంధంగా మారాయి. అంతేగాక ఈ చెత్తనుండి వచ్చే మురుగునీరు పాఠశాల గేట్‌ముందు నిలచిపోయి జిడ్డుజిడ్డుగా తయారైంది. ఈ జిడ్డును తొక్కుతున్న విద్యార్థులు అదుపుతప్పి పడిపోతున్నారు. నగరంలో మురిగినీటి నిల్వలు, నీటి కలుషితంతో ,పరిసరాలు అపరిశుభ్రంతో దయేరియా వ్యాప్తిచెంది తీవ్ర అస్వస్థతతకు గురవుతున్నారు. పాఠశాల విద్యార్థులు వెళ్ళే గేట్‌ముందు ఇలా మురుగు జిడ్డునీరు నిలచిపోయి అనారోగ్యం ప్రబలే ప్రమాదం ఉంది. ప్రతిరోజూ నగరపాలకసంస్థ పారిశుధ్యం సిబ్బంది చెత్తను లారీల్లో తొలగించి తరలిస్తున్నా మురుగనీరు, జిడ్డు పాఠశాల గేట్‌ముందే నిలచిపోతోంది. దీనివల్ల విద్యార్థులు,చిన్నపిల్లలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడ స్థానికులు చెత్తను వేయకుండా చూడటంతోబాటు మురుగుజిడ్డు నిల్వవుండకుండా చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.*

## సిఎం సొంత ఇలాఖాలో ఖిస్సా.. కుర్చీకా ..!!

### నామినేటెడ్ పదవులపై కన్నేసిన కుప్పం తెలుగుతమ్ముళ్లు - అధిష్టానానికి భారీగా వినతులు

కుప్పం, జూలై 10 ప్రభాతవార్త

రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పం నియోజకవర్గంలో తెలుగుతమ్ముళ్లు నియోజకవర్గ పరిధిలో ఉన్న నామినేటెడ్ పదవులపై కన్నేశారు. పదవుల కోసం తహతహలాడుతున్నారు. ఈ మేరకు తమకు ఆయా పదవులు కల్పించాలని కోరుతూ దేశం శ్రేణులు పార్టీ అధిష్టానానికి వినతిపత్రాలను అందిస్తున్నారు. అయితే ఇప్పటికే పార్టీ కోసం శ్రమించిన నేతలు, కార్యకర్తల వివరాలను పార్టీ అధిష్టాన ం సేకరించింది. దీంతో పాటు పదవులు కోరుకుంటున్న స్థానిక తెదేపా నాయకుల పనితీరు, ఎన్నికల సమయంలో వీరు ఎలా పనిచేశారనే విషయంగా అంతర్గత సర్వేలు సైతం చేయించినట్లు సమాచారం.

ఉన్న పదవులు ఇవే : కుప్పం నియోజకవర్గ పరిధిలో నామినేటెడ్ పోస్టులు కొంత ఆశాజనకంగానే ఉన్నాయి. కుప్పం రెస్కో, మార్కెట్ కమిటీ, కుప్పం టౌన్‌బ్యాంక్, కుప్పం బిల్డింగ్ సొసైటీ, కుప్పం ఏరియా ఆస్పత్రి ఛైర్మన్, పిహెచ్‌సిల ఛైర్మన్లు,రైల్వే బోర్డు మెంబర్, విఎస్ఎస్ ఛైర్మన్ల పదవులు భర్తీ కావాల్సి ఉంది. అలాగే నియోజకవర్గ పరిధిలో దేవదాయ శాఖ పరిధిలో ఉన్న కుప్పం శ్రీ తిరుపతి గంగమ్మ, గుడివంక శ్రీ సుబ్రమణ్యస్వామి, కుప్పం ఆంజనేయ ఆలయం, కంగుంది శ్రీ వేణుగోపాలస్వామి, శ్రీ విరూపాక్ష స్వామి ఆలయాలకు ఛైర్మన్లు, సభ్యుల పోస్టులు ఉన్నాయి. వీటితో పాటు పికెఎం ఉడా ఛైర్మన్ పదవితో పాటు రాష్ట్రస్థాయిలో ఏర్పాటయ్యే పలు కార్పోరేషన్లు, ఆలయాలకు సంబంధించిన పోస్టులను సైతం పొందాలని కుప్పం తెదేపా శ్రేణులు ఉత్సాహం చూపుతున్నారు. ఇదిలా ఉండగా పార్టీ ప్రతిపక్షంలో ఉన్న సమయంలో పోలీసు కేసులు ఎదుర్కొని జైలుశిక్ష అనుభవించిన నేతలు, కార్యకర్తలు తమకు అధిష్టాన ం తప్పక తగు గుర్తింపు ఇస్తుందనే ఆశాభావంతో ఎదురు చూస్తున్నారు. పార్టీ కోసం కుటుంబాలు వీడి జైలుజీవితం అనుభవించిన తమకు సిఎం చంద్రబాబునాయుడు తగు రీతిలో న్యాయం చేస్తారని పేర్కొంటున్నారు.



**సిఎం చంద్రబాబు కటాక్షంపై ఉత్కంఠ :** కుప్పం నియోజకవర్గంలో ఉన్న నామినేటెడ్ పోస్టుల భర్తీ అంశంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కరుణకటాక్షాలు ఎవరిపై ఉంటాయోననే ఉత్కంఠ నెలకొంది. ప్రధానంగా పార్టీ కష్టకాలంలో ఉన్న సమయంలో పనిచేసిన నేతలు, కార్యకర్తలకు తప్పక గుర్తింపు ఇస్తానని ఇదివరకే సిఎం చంద్రబాబు నాయుడు ప్రకటించిన విషయం విదితమే. పదవుల కోసం తన చుట్టూ తిరగవద్దని ఇప్పటికే తెలుగుతమ్ముళ్లకు స్పష్టం చేశారు. ఇటీవలే కుప్పంలో పర్యటించిన సిఎం చంద్రబాబు పార్టీ శ్రేణులు, కార్యకర్తల సమావేశంలో 243 పోలింగ్ బూత్‌ల పరిధిలో పార్టీకి వచ్చిన మెజార్టీపై నేతలు, కార్యకర్తల ద్వారా సమాధానాలు రాబట్టి వారి పని తీరుపై ఓ అంచనాకు వచ్చారు. ఈ నేపథ్యంలో ఈదఫా నామినేటెడ్ పదవులపై కొంత ఆసక్తి నెలకొంది. పార్టీకోసం పనిచేసిన కొందరు సీనియర్ నేతలతో పాటు తెలుగుయువత, మహిళా విభాగాల్లో కొందరికి పదవులు దక్కే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. నియోజకవర్గంలో ఉన్న నామినేటెడ్ పోస్టులపై నాలుగు మండలాల నేతలు కన్నేయడంతో ఎవరెవరికి ఏయే పోస్టులు దక్కుతాయో అని నేతలు, కార్యకర్తలు ఉత్కంఠలో ఉన్నారు. ఇదిలా ఉండగా కుప్పంలో ఉన్న నామినేటెడ్ పోస్టుల భర్తీకి కొంత సమయం పట్టే అవకాశం ఉందని తెలుస్తోంది.